క్లుప్తంగా

తూతూమంత్రంగా కౌన్సిల్ సమావేశం

ఏలేశ్వరం: ప్రజా సమస్యల ప్రస్తావన లేకుండా కౌన్సిల్ సమావేశం తూతూమంత్రంగా జరిగింది. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో అజెండా చదివి ముగించారు. సమావేశానికి కేవలం ఐదుగురు సభ్యులు మాత్రమే హాజరు కావడం విశేషం. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన చేయూత ఫౌండేషన్ సేవలు అభినందనీయం

తుని: పేదలకు స్పందన చేయూత ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం టి.శేషగిరి అన్నారు. రాజా ప్రభుత్వోన్నత పాఠశాలకు శనివారం స్పందన చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.20 వేల విలువ చేసే సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. పదో తరగతిలో 547 మార్కులు సాధించి ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో సీఎస్ఈ చదువుతున్న పేద విద్యార్థి పిల్లి కృపాకర్‌ను దత్తత తీసుకుని ఆర్థిక సహాయం అందజేశామని స్పందన చేయూత ఫౌండేషన్ ప్రతినిధులు ఎస్వీఎల్ ఆనంద్, ఈవూరి బుచ్చిరాజు తెలిపారు. పూర్వ విద్యార్థులు పొన్నాడ శ్రీనివాస్, కట్టా ప్రసాద్, జాన సత్యనారాయణ, గ్రంధి రామయ్య, మామిడి రాజా, మలిపెద్ది లింగ, టి.రమేష్, కె.నాగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కోటనందూరులో స్వచ్ఛ పక్వాడా

కోటనందూరు: గ్రామంలో శనివారం స్వచ్ఛ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది గ్రామంలోని మురుగు కాలువలు, లోతట్టు ప్రాంతాలను శుభ్రం చేయించారు. బ్లీచింగ్, దోమల నివారణ మందును పిచికారీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, పంచాయతీ విస్తరణాధికారి అరుణ్‌కుమార్ పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని అధికారులు తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో గ్రామస్తులు పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, ఉల్లూరి శ్రీను, మళ్ల శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

తుని: భారత సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు యువత కృషి చేయాలని భారత వికాస్ పరిషత్ గౌరవ అధ్యక్షుడు ఎంవీ సూర్యనారాయణరాజు సూచించారు. స్థానిక రెడ్ క్రాస్ భవనంలో శనివారం విద్యార్థులకు భారత్ కో జానో క్విజ్ పోటీలు నిర్వహించారు. తుని, పాయకరావుపేటల్లోని 15 పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానం శ్రీప్రకాష్ విద్యానికేతన్, ద్వితీయ స్థానం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు పొందారు. జూనియర్స్ విభాగంలో శ్రీప్రకాష్ విద్యానికేతన్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. న్యాయ నిర్ణేతలుగా బాలికోన్నత పాఠశాల హెచ్ఎం నూకరత్నం, కె.డేనియల్ జోసెఫ్ వ్యవహరించారు. విజేతలకు సూర్యనారాయణ రాజు బహుమతులను అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ తుని శాఖ అధ్యక్షుడు ఎల్.ఆచార్యులు, చదరం శివాజీ, నెల్లిపూడి నాగేశ్వరరావు, కె.గౌరీశంకర్, వేణుగోపాలస్వామి, డీవీఎల్ ప్రసాద్, శివప్రసాద్, జానకిరామ్, గౌతమ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ ప్రేమ్ కాజల్

తుని: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ప్రేమ్ కాజల్ సూచించారు. స్థానిక ఆదిత్య కళాశాలలో శనివారం తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ ప్రేమ్ కాజల్ మాట్లాడుతూ గంజాయి, కొకైన్ వంటి మాదక ద్రవ్యాల వలన కలిగే నష్టాలను వివరించారు. అసాంఘిక శక్తులు యువతను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తారని, చెడు వ్యాసనాల బారిన పడితే భవిష్యత్ నాశనమవుతుందన్నారు. అపరిచిత వ్యక్తులు గంజాయి విక్రయిస్తే ఎస్ఈబీ, స్థానిక పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు.

భూములకు పట్టాలివ్వాలి

జగ్గంపేట: మండలంలోని భావవరంలో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నేతలు కోరారు. ఈ మేరకు శనివారం ఎర్రజెండాలు చేతబట్టి భావవరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ భావవరంలో కామరకొండపై తుప్పలు, డొంకలతో ఉన్న 150 ఎకరాల భూమిని 200 కుటుంబాలకు చెందిన పేదలు సాగుకు అనుకూలంగా మార్చుకుని ఏళ్లతరబడి ఉపాధి పొందుతున్నారన్నారు. ఆ పేదలకు పట్టాలు ఇవ్వాలని గతంలో జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి అధికారులకు వినతిపత్రం సమర్పించామని తెలిపారు. అధికారులు స్పందించి కామరకొండ భూమిని సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

మట్టి గణపతికి జై..

- పర్యావరణ పరిరక్షణకు దోహదం
- గ్రామాల్లో జోరుగా మట్టి ప్రతిమల పంపిణీ

గ్రామాల్లో గణపతి నవరాత్ర ఉత్సవాల సందడి నెలకొంది. మరో రెండు రోజుల్లో వినాయక చవితి వేడుకలు ప్రారంభం కానుండడంతో ఒకపక్క కళాకారులు విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. మరోపక్క గ్రామాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. కాగా పర్యావరణ పరిరక్షణ నేపథ్యంలో పలువురు దాతలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ప్రజలకు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. తుని, పత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శనివారం మట్టి గణపతి విగ్రహాల పంపిణీ జోరుగా సాగింది.

తుని: వినాయక చవతి పండగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని తుని వాకర్స్ హెల్త్ క్లబ్ గౌరవాధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణ రాజు కోరారు. పట్టణంలోని ఫీడర్ రోడ్డులో శనివారం తుని వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఎకో ఫ్రెండ్లీ మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. ప్రజలందరికీ ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తామని ఎలెక్ట్ గవర్నర్ చదరం శివాజీ తెలిపారు. ప్రజలు రంగులు అద్దిన విగ్రహాలకు బదులు మట్టితో తయారు చేసిన సహజ విగ్రహాలను పూజించాలని కోరారు. తుని వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు కుందెం సత్యనారాయణ, చోడిశెట్టి బాబూరావు, మలిపెద్ది శ్రీను, దన్యంరాజు సత్యసాయి, గౌతమ్, వేణుగోపాల్ స్వామి, పర్వత బాబూరావు, దాసరి నాగరాజు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలు, వ్రత కల్ప పుస్తకాల పంపిణీ

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం మట్టి వినాయక ప్రతిమలు, వ్రత కల్ప పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసినట్టు రోటరీక్లబ్ కార్యదర్శి కె.కిశోర్‌రెడ్డి తెలిపారు. రోటరీ క్లబ్ వద్ద 1500 మందికి వీటిని అందజేశామన్నారు. ప్రజలు పర్యావరణ కోసం మట్టి ప్రతిమలను పూజకు వినియోగించాలని ఆయన కోరారు. రోటరీక్లబ్ ప్రతినిధులు సీహెచ్.మంగరాజు, శెట్టి నాగభూషణం, రాజశేఖర్, నర్సిబాబు, రామచంద్రరావు, ప్రసాద్, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలి

ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ మట్టివినాయక విగ్రహాలనే పూజించాలని స్థానిక ఎస్సై జి.సతీష్ కోరారు. వినాయక చవితి నేపథ్యంలో మార్స్ కంప్యూటర్స్ నిర్వాహకుడు అడపా దుర్గారావు ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ చౌక్ వద్ద శనివారం ప్రజలకు 500 మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పర్యవరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను మాత్రమే వాడాలన్నారు. మట్టి విగ్రహాల ద్వారా పర్యవరణానికి ఎటువంటి ముప్పు ఉండదన్నారు. కార్యక్రమంలో కోరాడ రాజు, పైల విజయ్‌కుమార్, ఉడతల రమణారావు, ప్రసన్న, వెంకటలక్ష్మి, నిమ్మల వెంకటేష్, దగ్గుబాటి అరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం

అన్నవరం: వినాయక చవితి వేడుకల్లో భక్తులు మట్టి వినాయకులనే పూజించాలని అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ కోరారు. శనివారం ఆయన రత్నగిరి పై సత్యదేవుని ఆలయం వద్ద భక్తులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలతో పర్యావరణానికి ఎటువంటి హాని కలగదన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో తయారు చేసిన విగ్రహాలతో పర్యావరణం దెబ్బతింటుందన్నారు. అనంతరం సత్యదేవుని ఆలయానికి వచ్చిన భక్తులకు 1500 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఆదివారం మరో 1500 విగ్రహాలను భక్తులకు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ జగ్గారావు, వ్రతపురోహిత కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, పురోహితులు నాగాభట్ల రవిశర్మ, కర్రి నాని, అల్లంరాజు శ్రీనివాస్, రిసెప్షన్ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎస్సై సతీష్



తునిలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు


రత్నగిరిపై భక్తులకు మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఈఓ చంద్రశేఖర్ అజాద్

సీఎం జగన్‌కు ఘన స్వాగతం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం వైఎస్సార్ కాపు నేస్తం నాలుగో విడత పథకం ప్రారంభోత్సవానికి తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు వచ్చారు. ఆయనకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు.

ఎస్సైగా నాగార్జున రాజు బాధ్యతల స్వీకరణ



జగ్గంపేట: జగ్గంపేట ఎస్సైగా కె.నాగార్జున రాజు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎస్సైగా పనిచేసిన విద్యాసాగర్‌కు సీఐ ప్రమోషన్ రావడంతో ఇక్కడ ఖాళీ ఏర్పడింది. కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం ఎస్సైగా పనిచేస్తున్న నాగార్జునరాజు ఇక్కడకు బదిలీపై వచ్చారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

శంఖవరం: గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. మండలంలోని సబ్‌ప్లాన్ ప్రాంతంలోని ఆవేల్తి, అనుమర్తి, ఒంబ్రేగుల గిరిజన గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పి.మల్లాపురం గ్రామంలో అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు తాగునీరు అందించాలన్నారు. మారుమూల గిరిజన గ్రామాలకు విద్య, వైద్యం అందించాలన్నారు. వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు గిరిజన గ్రామాల్లో పర్యటించి వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సచివాలయాల ద్వారా గిరిజనులకు ఆధార్, రేషన్ కార్డులు అందించాలని అధికారులకు సూచించారు. ఉపాధిహామీ పథకం ద్వారా గిరిజనులకు 150 రోజులు పని కల్పించాలని ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎ.విజయశాంతి, సర్పంచులు మేకల సుబ్బయ్య, గుండు నాగదేవి, ఎంపీడీఓ జి.శివరామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ డి.శ్రీనివాస్, ఎంఈఓ గోవింద్, ఏఓ పి.గాంధీ, హెచ్ఓ అరుణ్‌కుమార్, అన్నవరం ఎస్సై కిశోర్, పంచాయతీరాజ్ జేఈ మురళీ తదితరులు పాల్గొన్నారు.


అనుమర్తిలో గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న శంకర్ నాయక్

ప్రజలందరికీ రక్షిత తాగునీరు

తుని: పట్టణంలోని ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించేందుకు పైపులైన్ల నిర్మాణం చేపడుతున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి తెలిపారు. స్థానిక 2వ వార్డు టైలర్స్ కాలనీలో రూ.40 లక్షలతో చేపట్టిన పైపులైన్ల పనులను శనివారం ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ చింతల సునీత ప్రజలు పడుతున్న తాగు నీటి ఇబ్బందులను కౌన్సిల్ దృష్టికి తీసుకురావడంతో నిధులు మంజూరు చేశామని చైర్‌పర్సన్ సుధారాణి తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు అన్ని వార్డులకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.


తునిలో పైపు లైన్ల పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

బయట పడిన పవన్‌కల్యాణ్ నిజస్వరూపం


జాన్‌వెస్లీ..

జగ్గంపేట: అవినీతిపై పోరాటం చేస్తానని ప్రజల ముందు ప్రగల్భాలు పలికే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నిజస్వరూపం బయట పడిందని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ అన్నారు. జగ్గంపేటలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ ఉన్నత భావాలు కలిగిన వ్యక్తి అని, రాజకీయాల్లోకి వచ్చి ఏదో చేయాలని తపన పడుతున్నాడని ఇప్పటివరకూ చాలామంది భావించారన్నారు. కాని అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీ అధ్యక్షులు చంద్రబాబును జైలులో కలవడం, టీడీపీ–జనసేన కలిసే పోటీ చేస్తాయని ప్రకటించడం చూసి ఆ పార్టీ నేతలకే మింగుడు పడటం లేదని అన్నారు. నిజంగా పవన్ కల్యాణ్ ఆదర్శభావాలు కలిగిన వ్యక్తి అయితే చంద్రబాబుతో చేతులు కలిపేవాడు కాదన్నారు. అవినీతి పరుడుని జైలులో పెడితే రాష్ట్ర ప్రజలకు కష్టం వచ్చినట్లు పవన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. టీడీపీ, జనసేన పార్టీలకు ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని తెలిపారు.

పదోన్నతి పొందిన శ్రీనివాసరావుకు సత్కారం


ధర్మవరంలో శ్రీనివాసరావును సన్మానిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: పంచాయతీ కార్యదర్శిగా ఎం.శ్రీనివాసరావు అందించిన సేవలు అభినందనీయమని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. మండలంలోని ధర్మవరంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన శ్రీనివాసరావు ఈఓపీఆర్డీగా పదోన్నతిపై కోనసీమ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయనను శనివారం ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, సర్పంచ్ బెంతుకుర్తి సుశీల ఆధ్వర్యంలో పూలమాల, శాలువాతో సన్మానించారు. శ్రీనివాసరావు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జువ్వల సుజాత, సొసైటీ చైర్మన్ చెక్కపల్లి సత్తిబాబు, గ్రామ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు లొండ బాబు, పినిశెట్టి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత

తుని రూరల్: జీవరాశి మనుగడకు ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.లలిత అన్నారు. వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో శనివారం రసాయన, వృక్ష శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత మాట్లాడుతూ ఓజోన్ పొర జీవరాశిని రక్షణ కవచంలా కాపాడుతోందన్నారు. అటువంటి ఓజోన్ పొరను సంరక్షించుకునేందుకు విరివిగా మొక్కలను నాటాలన్నారు. ఓజోన్ పొరకు నష్టం వాటిల్లితే భూమిపై వాతవరణ పరిస్థితులు దెబ్బతిని ప్రకృతి వైపరీత్యాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం వి.కొత్తూరు గ్రామంలో విద్యార్థులు, అధ్యాపకులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసు, అధ్యాపకులు ఎస్.శ్రీధర్, ఎ.శ్రీనివాసరావు, రామ్మూర్తి, గోవిందు, వరప్రసాద్ పాల్గొన్నారు.


వి.కొత్తూరులో ఓజోన్ పొరపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

జోరుగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

కోటనందూరు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జోరుగా సాగుతోంది. వలంటీర్లు తమ పరిధిలో ఉన్న 50 ఇళ్లకు పారామెడికల్ సిబ్బందితో కలిసి వెళ్లి గ్రామస్తుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నారు. ఆరోగ్య పరమైన సమస్యలు ఉన్న వారి వివరాలు నమోదు చేస్తున్నారు. కేఈ చిన్నయ్యపాలెంలో జరుగుతున్న సర్వేను శనివారం ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ నెల 30 నుంచి గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. నిష్ణాతులైన వైద్యులతో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని ఎంపీడీఓ తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై శిక్షణ

కిర్లంపూడి: గ్రామాల్లో ఈ నెల 30 నుంచి నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జగపతినగరం సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు జగనన్న ఆరోగ్య సురక్ష విధివిధానాలపై ఎంఎల్ఓ ప్రసాద్ శిక్షణ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెంటకోట నాగబాబు, చదలవాడ బాబీ, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, పెనగంటి రాజేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా నిర్వహించారు. పండితులు ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేద మంత్రాలు, బాజాభజంత్రీల నడుమ మూడు సార్లు ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా ప్రధానాలయానికి చేర్చారు.వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, గంగాధరబట్ల శ్రీనివాస్, యడవిల్లి వెంకటేశ్వర్లు, ఏఈఓ పాలంకి జగ్గారావు, శానిటరీ ఇనస్పెక్టర్ వెంకటేశ్వరరావు, టెంపుల్ ఇనస్పెక్టర్ పెన్నాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


సత్యదేవుడు, అమ్మవారిని తిరుచ్చి వాహనం మీద ఊరేగిస్తున్న భక్తులు

నేడు విద్యుత్ అంతరాయం

జగ్గంపేట: విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానిక ట్రాన్స్‌కో డీఈ రత్నాలరావు శనివారం తెలిపారు. మండలంలోని జగ్గంపేట, కాట్రావులపల్లి, నీలాద్రిరావుపేట గ్రామల్లో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

విజ్ఞానదాయకంగా విద్యార్థుల ఆవిష్కరణలు

గండేపల్లి: విద్యార్థుల ఆవిష్కరణలు విజ్ఞానదాయకంగా ఉన్నాయని ఆదిత్య కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎం.శ్రీనివాసరెడ్డి, ఎస్‌టీవీఎస్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో ఆదిత్య టెక్ ఫెస్ట్ వేద 2కె23, ఆదిత్య పోలీవేద 2కె23 పేరిట రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఇంజినీరింగ్ కళాశాలల నుంచి సుమారు 1000 మంది విద్యార్థులు ఈ ఫెస్ట్‌లో పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులు ప్రాజెక్ట్, పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్ ద్వారా తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారన్నారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.


ఆదిత్యలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ప్రత్తిపాడు రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ సూచించారు. మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలను శనివారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. మండలస్థాయి పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చిన బాబు, హెచ్ఎం కె.చినరాంమూర్తి, సొసైటీ చైర్మన్ చెక్కలపల్లి సత్తిబాబు, సర్పంచ్ బెంతుకుర్తి సుజాత, ఎంపీటీసీ జువ్వల సుజాత, ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

తుని: స్థానిక రాజా కళాశాల మైదానంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయని ఎంఈఓ పి.గీతాదేవి తెలిపారు. విద్యార్థులకు బాలుర, బాలికల విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, 100, 400, 600 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంఈఓ గీతాదేవి, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, వెంకటేశ్వరరావు, శేషగిరి, అప్పారావు, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.


ఏలేశ్వరంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

ఏలేశ్వరం: విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎంఈఓ అబ్బాయి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మండల స్థాయి ఆటల పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించే కబడ్డీ, వాలీబాల్, టెన్నిస్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, అలమండ చలమయ్య, అడపా పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

గండేపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ పింఛన్లు అందుతున్నాయని ఎంపీపీ చలగళ్ల దొరబాబు పేర్కొన్నారు. మండలంలోని మల్లేపల్లిలో నూతనంగా మంజూరైన పింఛన్లను శనివారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొమ్మ శ్రీను, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తగా 156 మందికి పింఛన్లు

తొండంగి: గ్రామంలో కొత్తగా 156 మందికి పింఛన్లు మంజూరైనట్టు వైస్ ఎంపీపీ నాగం గంగబాబు తెలిపారు. గ్రామ సచివాలయం–1, 2 పరిధిలోని కొత్తగా మంజూరైన పింఛన్లను శనివారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల ఇంటికే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామ సచివాలయ, వాలంటరీ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గాబు రాజు, గ్రామ సర్పంచ్ సోమాల ప్రసాద్, ఎంపీటీసీ శివకోటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


మల్లేపల్లిలో లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ దొరబాబు

పోరాటంతోనే సత్రం భూములకు వేలం

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలోని సుందరమ్మ సత్రం భూములకు వేలం పాట నిర్వహించాలని రైతు కూలీ సంఘం చేసిన అలుపెరగని పోరాటంతోనే ఎండోమెంట్ అధికారులు స్పందించి వేలంపాటకు ప్రకటన విడుదల చేశారని ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరంజనేయులు అన్నారు. రంప యర్రంపాలెంలో ఏపీఆర్‌సీఎస్ ఆధ్వర్యంలో శనివారం రైతుకూలీలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ 15 ఎకరాల సుందరమ్మ సత్రం భూములను వేలంలో రైతు కూలీలకు దక్కకుండా కొంతమంది దళారులు పాడుకుని శిస్తు కట్టకుండా వదిలిపెట్టి వెళ్లిపోయారన్నారు. ఆ భూములకు వేలం నిర్వహించాలంటూ గత కొంత కాలంగా రైతు కూలీ సంఘం చేసిన పోరాటలకు ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ స్పందించి సత్రం భూములకు వేలంపాట నిర్వహించేందుకు చర్యలు తీసుకుందన్నారు. మరో 15 ఎకరాల సుందరమ్మ సత్రం భూములు అన్యాక్రాంతం అయ్యాయని, సర్వే చేసి ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు.

